డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ చౌరస్తా సమీపంలో డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. పైపులైన్ల నిర్మాణానికి సీసీ రోడ్డు తవ్వేందుకు అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో పనుల్లో జాప్యం జరిగిందన్నారు. హోలీట్రినిటీ హైస్కూల్ వీధిలో డ్రైనేజీ, రోడ్డు నిర్మాణ పనులు త్వరలో చేపడతామని స్థానికులకు హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, డి.శివముదిరాజ్, సుధాకర్‌గుప్తా, నేత భాస్కర్, పూస గోరఖ్‌నాథ్, ముదిగొండ మురళి పాల్గొన్నారు.



డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ డివిజన్‌లో

రూ. 32.50 లక్షలతో పైపులైన్లు

బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో ఐదు డివిజన్లలో తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, పవర్ బోరింగ్‌ల మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. బుధవారం కాచిగూడ డివిజన్ సూరజ్‌నగర్ బండల బస్తీలో రూ. 31 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైపులైన్, రూ. 1.50 లక్షలతో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.

కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్, సీనియర్ నాయకులు బద్దుల ఓంప్రకాష్‌యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బి.కృష్ణగౌడ్, శేషు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు ఎం. శివాజీ తదితరులు

అనాథాశ్రమంలో అన్నదానం

ముషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు ఎం. శివాజి అన్నారు. బీజేవైఎం అధికార ప్రతినిధి బుర్ర రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు శక్తిసింగ్, రాజునేత, అనిల్‌కుమార్, లడ్డు, బాబీ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి కృషి : మంత్రి పొన్నం

చిక్కడపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి కృషి చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదర్శకిరణం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, బీసీ సంఘాల నేత వంగాల బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు మంత్రిని బుధవారం కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ.. బీసీల కోసం ఆదర్శకిరణం, ఆదర్శ సంస్థల పక్షాన బాల్‌రాజ్‌గౌడ్ చేస్తున్న కృషి గొప్పదన్నారు. మంత్రిని కలిసిన వారిలో విజయ్‌కుమార్‌గౌడ్, వెంకన్నగౌడ్, బబ్బురు భిక్షపతి గౌడ్ తదితరులు ఉన్నారు.

'వాకర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలి'

చిక్కడపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇందిరాపార్కులో వాకర్స్ అసోసియేషన్ పేరిట కొందరు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని పలువురు వాకర్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కోరారు. బుధవారం వారు ఎమ్మెల్యేను కలిశారు. వాకర్స్ సౌకర్యార్థం పార్కులో ఏర్పాట్లు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ముఠాగోపాల్ తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హనుమాన్‌గౌడ్, రవీందర్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గోశాల ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లోయర్‌ట్యాంక్‌బండ్, అంబేద్కర్ భవన్, రజక కాలనీ, సర్దార్‌జీ పెట్రోల్‌పంప్, తాతానగర్, సింగారి బస్తీ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మారియట్ హోటల్, పెట్రోల్ పంప్, కొత్త బజార్, హనుమాన్ టెంపుల్, సంధ్య బార్, పద్మశాలి కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

ఆంజనేయస్వామి ఆలయ

హుండీ ఆదాయం రూ. 1.12 లక్షలు

చిక్కడపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం లక్షా 12 వేల 315 రూపాయలు వచ్చింది. బుధవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఈవో దేవనాథం పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఈవో దేవనాథం మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు సహకరించాలని కోరారు.

'నూతన ప్రభుత్వం - దివ్యాంగుల అభివృద్ధి' అంశంపై

20న రౌండ్ టేబుల్ సమావేశం

రాంనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అఖిల భారత దివ్యాంగుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ నెల 20న సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో 'నూతన ప్రభుత్వం - దివ్యాంగుల అభివృద్ధి' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. బుధవారం రాంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యవాదులు, దివ్యాంగుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ప్రొఫెసర్ ఎం. కోదండరాం ప్రధానవక్తగా, పలు ప్రజా సంఘాల నేతలు, దివ్యాంగుల సంఘాల నేతలు హాజరవుతారని తెలిపారు.

'గుంటూరు కారం' సినిమా విలన్లకు

మార్క్స్, లెనిన్ పేర్లు తొలగించాలి

రాంనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కారం సినిమాలో ప్రధాన రౌడీ పాత్రలకు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లు వెంటనే తొలగించాలని, చిత్ర దర్శకుడు త్రివిక్రమ్, హీరో మహేష్‌బాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మామిడికాయల పరశురాం డిమాండ్ చేశారు. లేనిపక్షంలో త్రివిక్రమ్ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా సినిమా ప్రదర్శనను అడ్డుకుంటామని హెచ్చరించారు. బుధవారం విద్యానగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కమ్యూనిస్టులను అవమానించడం తగదన్నారు. చిత్రంలో కుర్చీ మడత పెట్టి అనే పాటను కూడా తొలగించాలన్నారు.




అంజిరెడ్డిని సన్మానిస్తున్న పలు పార్టీల నేతలు

ముగిసిన మల్లన్న జాతర

ముషీరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో భ్రమరాంబ మల్లికార్జున స్వామి(మల్లన్న) జాతర విజయవంతంగా ముగిసిందని ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా జాతర విజయవంతానికి కృషి చేసినందుకు అంజిరెడ్డిని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు బుధవారం సన్మానించారు. పలు పార్టీల నాయకులు తుమ్మరాజు, గోక నవీన్, మురళి, అరుణ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



షాదుల్లా

బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పనికి వెళ్లమన్నందుకు ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక కూరగాయల మార్కెట్‌లో నివసిస్తున్న షాదుల్లా(39) కొంత కాలం వాచ్‌మన్‌గా పనిచేసి మానేసి ఇంటివద్దే ఉంటున్నాడు. భార్య ఏదైనా పనికి వెళ్లమనడంతో గత ఏడాది నవంబర్ 8న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గతంలో కూడా పలుమార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి కొన్ని నెలల తర్వాత తిరిగి వచ్చాడు. తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు భావించారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య కె. వెంకటమ్మ కాచిగూడ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయం చేయండి

- గురుకుల ఉపాధ్యాయ అభ్యర్థుల నిరసన

కవాడిగూడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ గురుకుల ఫలితాలు ప్రకటించాలని గురుకుల ఉపాధ్యాయ పురుష అభ్యర్థుల సంఘం రాష్ట్ర నాయకుడు కొండపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ మహిళలకు రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో గురుకుల ఉపాధ్యాయ పురుష అభ్యర్థులు, మహిళలు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

కొండ్రపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల ప్రకటించిన ఫలితాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్, స్టాఫ్ నర్స్ నియామకాలలో సమాంతర హారిజాంటల్ రిజర్వేషన్లు పాటిస్తున్నారని, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, జెన్‌కో నియామకాల్లో కూడా ఇదే పద్ధతి పాటిస్తున్నారని చెప్పారు. గురుకుల బోర్డు ప్రకటించిన అన్ని నోటిఫికేషన్లలో బాలికలు, బాలుర పాఠశాలలో మహిళా అభ్యర్థులకు 33శాతం రిజర్వేషన్లు కేటాయించడంతో పురుష అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల ఫలితాల పోరాట సమితి నాయకులు ఉపేందర్, చిరంజీవి, శ్రీనివాస్, హరి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గురుకుల ఉపాధ్యాయ అభ్యర్థులు, సంఘం నేతలు

మనువాదాన్ని మట్టుబెట్టాలి

- కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

రాంనగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మనువాదుల మానసిక వేధింపుల వల్లే రోహిత్ వేముల బలయ్యారని, అది మతోన్మాదుల హత్యగానే పరిగణించాలని కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ఆరోపించారు. మనువాదాన్ని మట్టుబెట్టి ప్రజాస్వామిక విలువలను పరిరక్షించడమే రోహిత్ వేములకు అర్పించే నివాళి అని అన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయం వద్ద రోహిత్ వేముల 8వ వర్ధంతి బుధవారం నిర్వహించారు. రోహిత్ చిత్రపటానికి కేవీపీఎస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉన్నత విద్యాలయాల్లోకి ప్రవేశించిన దళిత విద్యార్థులను చదువుకు దూరం చేసే విధంగా మనువాదులు మానసిక ఒత్తిళ్లకు గురిచేసి ఆత్మహత్యలకు ఉసిగొల్పుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి, మాజీ అధ్యక్షుడు ఎం. శోభన్, నాయకులు దామెర కిరణ్, ఎన్.బాలపేరు, ఆర్.శ్రీనివాస్, వి.రఘు తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ త్యాగం మరువలేనిది

కవాడిగూడ: దళిత బహుజన విద్యార్థి పోరాట యోధుడు రోహిత్ వేముల చక్రవర్తి త్యాగాలను వృథా కానివొద్దని దళిత బహుజన జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. రోహిత్ వర్ధంతి సందర్భంగా దళిత బహుజన పార్టీ, దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ సంయుక్తాధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా విద్యాలయాల్లో దళిత బహుజన విద్యార్థుల సమస్యలపై గళం విప్పిన వ్యక్తి రోహిత్ అని గుర్తు చేశారు. రోహిత్ త్యాగం మరువలేనిదని అన్నారు. డీబీఎస్ఎఫ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇటికాల గణేష్, డిప్యూటీ కో-ఆర్డినేటర్ తిరుదు రవి, దళిత బహుజన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీరం సతీష్‌కుమార్, నాయకులు సీహెచ్ సుబ్బారావు, చక్రశ్యామ్, నక్కా దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.





రోహిత్‌కు నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నేతలు, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తదితరులు



చర్చా కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు

అసైన్డ్ భూములపై ప్రత్యేక కమిటీ నియమించాలి

- మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు

బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అసైన్డ్ భూములపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు కోరారు. ధరణి పథకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సమాఖ్య కన్వీనర్ కరుణాకర్ దేశాయ్ అధ్యక్షతన అసైన్డ్ భూములు - పూర్తి పట్టా హక్కుల కల్పనపై చర్చా కార్యక్రమం జరిగింది. పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు మాట్లాడుతూ.. అసైన్డ్ భూములపై సాగు చేసుకునే వారికే పూర్తి హక్కులు ఉండాలని అన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. దళితుల భూములను గుంజుకుంటే చెప్పులతో కొట్టాలని, ప్రభుత్వాలు పద్ధతి మార్చుకోకపోతే నక్సలైట్ ఉద్యమం పునరావృతం తప్పదని హెచ్చరించారు. అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు సాగుదారులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేయూ జాతీయ అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. భూమికి సంబంధించిన పాలసీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సాగు చేసుకున్న వారికి భూమి హక్కు కల్పించి అమ్ముకునే అవకాశం కూడా ఇవ్వాలని ఆయన కోరారు.

నేటి నుంచి అండర్ 19 క్రికెట్ టోర్నమెంట్

అంబర్‌పేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ అండర్ 19 క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

అంబర్‌పేట ఆలీకేఫ్ చౌరస్తా సమీపంలో వాటర్ వర్క్స్ మైదానంలో ఉదయం 9.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ టోర్నమెంట్ ప్రారంభిస్తారని చెప్పారు. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ప్రముఖ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, డీసీసీ ఖైరతాబాద్ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

త్వరలో అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్

భవనం ప్రారంభం

చిక్కడపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్ నూతన భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ తెలిపారు. భవనాన్ని బుధవారం ఆమె సందర్శించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భవన నిర్మాణానికి రూ. 65 లక్షలు మంజూరు చేశారన్నారు. బీజేపీ నేతలు వినయ్‌కుమార్, రత్న సాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, ఆకుల సురేందర్, సురేష్ పాల్గొన్నారు.



వెల్ఫేర్ కమ్యూనిటీ సెంటర్‌ను సందర్శించిన కార్పొరేటర్ తదితరులు

రజనీ గంగాధర్ రచనలు ఆవిష్కరణ

చిక్కడపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పూసల ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో ప్రముఖ రచయిత పూసల రజనీగంగాధర్ రచించిన సామెత కథలు కథాసంపుటి, పద్మసౌరభం పద్యసంపుటి, గానగంధర్వ ఘంటసాల హరికథా సంపుటి ఆవిష్కరణ బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి జల్ది విద్యాధరరావు పాల్గొని సంపుటాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. వాడుకలో తెలుగులో ఉన్న సామెతలను కథల రూపంలో రజనీ గంగాధర్ వెలువరించి వాటిలోని అంతరార్థం తెలిపారన్నారు. అధ్యక్షత వహించిన సాహితీకిరణం ఎడిటర్ పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ.. తెలుగువారి ఆరాధ్యగాయకుడు ఘంటసాల జీవిత కథను హరికథగా పాడుకునే విధంగా రచించారని అభినందించారు. బండి శంకరం, విరజానంద, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. పులివర్తి కృష్ణమూర్తి అధ్యక్షతన కవి పెద్దూరి వెంకటదాసు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. తంగిరాల చక్రవర్తి బాల గంగాధరయ్య రషీద్ స్వీయకవితలు చదివారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

బ్రాహ్మణ వ్యాపారుల అభివృద్ధికి తోడ్పాటు

- ఎస్‌ఈఏ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌బీ రామ్



మాట్లాడుతున్న ఎస్‌బీ రామ్

నల్లకుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ వ్యాపారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్నామని సనాతన ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (ఎస్ఈఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌బీ రామ్ వెల్లడించారు. ముఖ్యంగా బ్రాహ్మణ వ్యాపారులను ఏకీకృతం చేయడమే ఏకైక లక్ష్యం అన్నారు. బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణ వ్యాపారుల ప్రయోజనాల కోసం 2018లో ఎస్ఈఏ తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో స్థాపించామన్నారు. ఎస్ఈఏ యువ వ్యాపారవేత్తల కోసం ప్రత్యేక స్టార్టప్ వింగ్ ప్రారంభించాలని, పెట్టుబడిదారులతో నెట్‌వర్క్‌లో సహాయపడాలని ప్రతిపాదించామన్నారు. ఆరవ వార్షికోత్స డైరీని ఈనెల 23న విడుదల చేస్తున్నామని తెలిపారు. ఎస్ఈఏ జాతీయ అధ్యక్షుడు ఆర్‌సీ మూర్తి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పీసపాటి, కోశాధికారి మురళీధర్ ఆదిరాజు, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు రామ అయ్యగారి, కార్యదర్శి స్వర్ణ మంజీర గొల్లపూడి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజన అవార్డుకు సౌజన్య ఎంపిక



బర్కత్‌పుర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ వంటి వివిధ సంస్థలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీహెచ్ సౌజన్యను జాతీయ యువజన అవార్డు-2024కు ఎంపిక చేసినట్లు నవ భారత్ నిర్మాణ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు బత్తుల హేమంత్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 19న తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఆమెకు అవార్డు ప్రదానం చేస్తున్నామని ఆయన చెప్పారు. సౌజన్య గచ్చిబౌలిలో రొడా మిస్త్రీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎంఎస్‌డబ్ల్యూ చదువుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

22న సెలవు ప్రకటించాలి

నల్లకుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈనెల 22న సెలవు ప్రకటించాలని బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నావజ్ఝల సూర్యప్రకాష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నల్లకుంటలో ఆయన విలేకరులతో మాట్లాడారు.